

జగనన్నతోనే సామాజిక న్యాయం..
సామాజిక న్యాయం సీఎం జగనన్నతోనే సాధ్యమని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు.
- 8లో



రైతులకు పశుబీమా అండ
పశుపోషకులకు వైఎస్సార్ పశు బీమా అండగా నిలుస్తుందని కలెక్టర్ వెంకటరమణా రెడ్డి తెలిపారు.
- 8లో



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	26
తిరుమల	31	22
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,120 మంది స్వామివారిని దర్శించుకోగా.. 34,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ రామ సుబ్రమణియన్ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

26 నుంచి కుష్టు వ్యాధి సర్వే


డాక్టర్ రవిరాజు

చిత్తూరు రూరల్: ఈనెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు జరిగే జాతీయ కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను బాధ్యతతో నిర్వర్తించాలని కుష్టు, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. గురువారం చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమావేశ మందిరంలో గురువారం కుష్టు వ్యాధి సర్వేపై ఆశావర్కర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో సర్వేల విషయంలో ఆశావర్కర్లు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చాలా ప్రాంతాల్లో ఒక్క కేసును కూడా గుర్తించ లేదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, కండరాలలో బలహీనత, నరాల్లో తిమ్మిరి, కళ్లు పూర్తిగా మునుకోపోవడం వంటి లక్షణా లను గుర్తించాలన్నారు. అధికారులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న పుత్తూరు పిల'గోడు' పుస్తకావిష్కరణ



పుత్తూరు రూరల్: పుత్తూరుకు చెందిన ప్రముఖ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు రచించిన పుత్తూరు పిల'గోడు' హాస్య కథల పుస్తకాన్ని ఈనెల 25న హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర రవాణా, ఆర్అండ్‌బీ శాఖ సెక్రటరీ కేఎస్.శ్రీనివాసరాజు ఆవిష్కరించనున్నారు. పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందిన రచయిత యాభై ఏళ్ల కిందట జరిగిన సరదా సంఘటనలను కథలుగా మలిచి పుస్తక రూపంలో సంకలనం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల కలయికతో మాట్లాడే చిత్తూరు జిల్లా యాస మాటలతో కథలు కడుపుబ్బా నవ్విస్తాయి. హైదరాబాద్‌కు చెందిన 'అచ్చంగా తెలుగు ప్రచురణ'ల ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ తదితరులు హాజరు కానున్నారు.

మూడుముక్కలాట



కుట్ర రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు. తన అవసరానికి వాడుకుని ఎంతటివారినైనా పక్కకు నెట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇదే వ్యూహాన్ని శ్రీకాళహస్తిలో అమలు చేస్తున్నారు. తన సర్వేలో ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డికి ఓటమి తప్పదని తేలడంతో పక్కచూపులు చూస్తున్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యేలకు ఎర వేశారు. తరచూ పార్టీలు మారే నేతగా పేరున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడిని పార్టీలోకి ఆహ్వానించారు. అయనతోపాటు ఓ సామాజిక వర్గానికి చెందిన ఓట్ల కోసం మరో మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్యను సైతం పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటు బొజ్జల సుధీర్‌తోపాటు, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో మూడు ముక్కలాడుతుండడంపై ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

- శ్రీకాళహస్తిలో బొజ్జలపై డౌట్.. ఎస్సీవీ వైపు మొగ్గు
- మరో వైపు 'పల్లె' ఓటర్ల కోసం మాజీపై మోజు
- ఓటమి ఖాయమని తేల్చేసిన బాబు సొంత సర్వే
- దాగుడుమూతలు ఆడుతున్న చంద్రబాబు

సాక్షి, తిరుపతి: శ్రీకాళహస్తిలో టీడీపీ అధినేత చంద్రబాబు మూడు ముక్కలాట ఆడుతున్నారు. అమరావతి నుంచి అందిన తాజా సమాచారం మేరకు.. తన సొంత సర్వేలో ఓటమి ఖాయమని తేలడంతో స్థానిక నాయకులతో దాగుడుమూతలు ఆడుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డికి ఇష్టం లేకపోయినా.. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుని పార్టీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇంకోవైపు మరో మాజీ ఎమ్మెల్యే సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండడంతో ఆ దిశగా కూడా పావులు కదుపుతున్నారు. చివరకు నిలిచేదెవరు.. గెలిచేదెవరో తెలియక తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు.

కష్టమైనా.. నష్టం తప్పదనే!

స్థిరత్వం లేని నాయకుడిగా, తరచూ పార్టీలు మార్చే వ్యక్తిగా పేరుగడించిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మరలా టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 14న చంద్రబాబు సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నట్లు ప్రకటించుకున్నారు. పార్టీలో చేరిక వెనుక చాలా పెద్ద వ్యూహమే ఉన్నట్లు ఆయన అనుచరులు గుసగుసలాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బొజ్జల సుధీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తే మరింత నష్టం తప్పదని గ్రహించే.. ఎస్సీవీ నాయుడు చేరికకు పచ్చజెండా ఊపినట్లు చెప్పుకుంటున్నారు.

గ్రూపు రాజకీయాలకు మారుపేరు

మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఏ పార్టీలో ఉన్నా.. తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం, అందులోనూ గ్రూపులు చేయడంలో దిట్ట. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నుంచి నేటి వరకు ఎస్సీవీ గ్రూపులను పెంచి పోషిస్తూ.. తను ఎక్కడుంటే.. అక్కడ తన అజమాయిషీ నడవాలని కోరుకుంటారని తన అనుచరులే చెబుతున్నారు. అందుకోసమే తరచూ పార్టీలు మారుతుంటారనే ఆరోపణలు ఉన్నాయి. మరలా టీడీపీలో చేరినా.. తన గ్రూపుని ఏర్పాటు చేసుకోవడం ఖాయమని శ్రీకాళహస్తిలోని తమ్ముళ్ల ఆందోళన. ఇదే ఆందోళన బొజ్జల సుధీర్‌రెడ్డిలోనూ ఉంది. తన తండ్రితో ఉన్నప్పుడు చోటుచేసుకున్న సంఘటనలను గుర్తుచేసుకునే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎస్సీవీ చేరికపై అసంతృప్తిగా ఉన్నారని టీడీపీ శ్రేణులు చెబుతున్నారు. పార్టీలో చేరేపని అయితే కుదురుగా ఉండాలని సుధీర్ రెడ్డి తన వాయిస్ మెసేజ్, మీడియా సమక్షంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని నేరుగా అధినేత చంద్రబాబుతో అన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో పార్టీలో చేరికను వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది.

బాబు ఆరాటం

శ్రీకాళహస్తిలో ఎస్సీవీ రాకను బొజ్జల సుధీర్ అడ్డుకుంటున్నా.. టీడీపీ కండువా కప్పేందుకు చంద్రబాబు ఏర్పాట్లు చేశారు. ఎస్సీవీ చేరికను వ్యతిరేకిస్తే.. బొజ్జలను పార్టీ నుంచి పంపించేయాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే ఇంకో వైపు మరో మాజీ ఎమ్మెల్యే మునిరామయ్యను దారిలో పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు దగ్గరపడే సమయానికి పరిస్థితులు ఎలా ఉంటాయోనని.. చంద్రబాబు పల్లెరెడ్డి సామాజిక వర్గ ఓటర్ల కోసం మునిరామయ్యను అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు కూడా ఉన్నట్లు అమరావతి సర్కిల్ నుంచి అందిన సమాచారం. శ్రీకాళహస్తి కోసం బొజ్జల సుధీర్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్యతో గేమ్ మొదలు పెట్టారు. ఈ గేమ్‌లో ఎవరు నిలుపుతారో? ఎవరిని కరివేపాకులా వాడుకుంటారో? అనేది చంద్రబాబుకే ఎరుక.

మరింత విస్తరిద్దాం!


తాడేపల్లిగూడెం నుంచి వర్చువల్ విధానంలో కాంటినెంటల్ కాఫీ పరిశ్రమ విస్తరణ శంకుస్థాపనకు బటన్ నొక్కుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- రూ.400 కోట్లతో కాంటినెంటల్ కాఫీ పరిశ్రమ విస్తరణ
- కువ్వాకొల్లి వద్ద ఏర్పాటు
- వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన


కువ్వాకొల్లి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాళెం మండలం, కువ్వాకొల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని కాంటినెంటల్ కాఫీ పార్కులో సీసీఎల్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్‌స్టంట్ కాఫీ ప్లాంట్ విస్తరణకు శ్రీకారం చుట్టారు. రూ.400 కోట్లతో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమకు గురువారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సీఎం క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. సీసీఎల్ ప్లాంట్ నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు జీఎం రామారావు, ప్లాంట్ హెడ్ సెజ్ సూర్య అచ్యుతరావు, ప్లాంట్ హెడ్ సర్వేశ్వరరావు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, స్థానిక సర్పంచ్ చంద్రయ్య పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో కాంటినెంటల్ ఇన్‌స్టంట్ కాఫీ ప్యాక్‌ను రూ.400 కోట్ల పెట్టుబడితో ఏటా 16వేల మెట్రిక్ టన్నుల తయారీ కెపాసిటీతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా పరోక్షంగా 400 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ సింగిల్ డెస్క్ విధానంలో అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. తిరుపతి జిల్లా కువ్వాకొల్లి వద్ద ఇప్పటికే ఏర్పాటైన కాంటినెంటల్ కాఫీ పార్కులో మూడో దశలో సీసీఎల్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇన్‌స్టంట్ కాఫీ ప్లాంట్‌ను విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలా అనుకూలమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

అల్లుకున్న 'పోగు'బంధం!



నాపేరు జింకా వెంకటలక్ష్మి. వెంకటగిరిలోని బొప్పాపురంలో చేనేత కార్మికురాలుగా పనిచేస్తున్నాను. నాలుగేళ్లుగా వైఎస్సార్ నేతన్ననేస్తం పథకం ద్వారా లబ్ధిపొందుతున్నా. గతంలో గుంతమగ్గంతో పనిచేసుకునేవాళ్లం. నేడు నేతన్న నేస్తం పథకం ద్వారా అందిన రూ.96 వేలతోపాటు మరికొంత నగదుతో స్టాండ్ మగ్గం ఏర్పాటు చేసుకున్నాం. మగ్గం పనులు సులభంగా వేగవంతంగా చేసుకోగలుగుతున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

- నేతన్నకు జగనన్న నేస్తం
- ఏటా రూ.24 పంపిణీ
- ఇప్పటికే నాలుగు దఫాలు అందజేత
- ఐదో విడత సాయానికి ముమ్మర కసరత్తు
- సంతోషం వ్యక్తం చేస్తున్న నేతన్నలు

వెంకటగిరి: ఒకప్పుడు ఎవరూ పట్టించుకోక.. ఆదుకునే దిక్కులేక అల్లాడిన చేనేత కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగుల దివిటీని వెలిగించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు అండగా నిలిచారు. నేతన్న నేస్తం పేరుతో ఇప్పటికే ఒక్కో చేనేత కార్మికునికి ఏడాదికి రూ.24 వేల చొప్పున పంపిణీ చేసిన అధికారులు.. ఐదో విడత పంపిణీకి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా చేనేత కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఒక్కో కార్మికునికి రూ.96 వేలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో దాదాపు 10 వేల చేనేత కుటుంబాలు మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో వెంకటగిరి, సూళ్లూరుపేట, తడ, గూడూరు, చిల్లకూరు, వాకాడు, కోట, నారాయణవనం, పుత్తూరు, డక్కిలి, బాలాయపల్లి ప్రాంతాల్లో 6 వేల కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి శ్రీకారం చుట్టారు. చేనేత కార్మికునికి నెలకు రూ.2 వేల వంతున ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా మగ్గం ఉన్న చేనేత కార్మికులకు రూ.24 వేలు వంతున ఒక్కో కార్మికునికి రూ.96,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు.

నేతన్న నేస్తం సమాచారం

ప్రాంతం	లబ్ధిదారులు	లబ్ధిపొందిన మొత్తం రూ.కోట్లు
ఉమ్మడి నెల్లూరు జిల్లా	18,634 మంది	44.42
వెంకటగిరి	6,364 మంది	15.27

ఆధునిక బాట

చేనేతను ఆధునిక బాటలోకి తీసుకువచ్చేందుకు కేంద్రం సాయంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇప్పటి వరకూ పట్టుచీరలు, నూలు చీరలు, పంచెలు, టవల్‌ల్లు వంటివి మగ్గాలపై నేస్తుండగా.. ప్రస్తుతం డ్రస్‌మెటీరియల్ వంటి వాటిని ఉత్పత్తి చేసేందుకు క్లస్టర్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా నేత కార్మికులకు లిఫ్టింగ్ మిషన్‌లు, హుక్ జాకార్డ్, డబ్బావైన్డింగ్ మిషన్‌లు, ఫ్రేమ్ లూమ్స్ వంటి ఆధునిక పరికరాలను 90శాతం సబ్సిడీతో అందిస్తోంది. వర్క్‌షెడ్‌లను సైతం నిర్మిస్తోంది.

కష్టకాలంలో సాయం



కరోనా వల్ల అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. మగ్గం పనులు జరగనిరోజుల్లో కూడా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా సాయం అందించి ఆదుకున్నారు. ప్రతి ఏటా అందుతున్న రూ.24 వేలతో అప్పులు చేయకుండా చేనేతకు అవసరమైన నూలు, జరీ, పట్టు వంటి ముడి సరుకులు కొనుక్కుంటున్నాం.

– కె.జయరాం, చేనేత కార్మికుడు, బొప్పాపురం సాలికాలనీ, వెంకటగిరి

మా బతుకుల్లో వెలుగులు



చేనేత బతుకుల్లో సీఎం జగనన్న వెలుగులు నింపారు. నేత వృత్తిని నమ్ముకున్న వారందరూ జగనన్నను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. గత ప్రభుత్వంలో సరైన ఆదరణ లేదు. చాలా మంది నేత పనులను వదిలి నిర్మాణరంగంలో కూలీలుగా జీవనం సాగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– పీ.సుబ్రమణ్యం, చేనేత కార్మికుడు, బంగారుపేట, వెంకటగిరి

ఆర్థికంగా బలోపేతం



చేనేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోంది. అర్హత కలిగిన చేనేత కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందజేస్తోంది. కేంద్ర సాయంతో క్లస్టర్ల ఏర్పాటు, అర్హులకు ఫించన్‌లు అందిస్తోంది.

-వీ.వెంకటరామ్, ఏడీ చేనేత జౌళిశాఖ, తిరుపతి

మరోసారి.. మనమే ఫస్ట్ ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీఓ తిమ్మాడి చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: రెండు సార్లు వరుసగా రాబడిలో తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని, మరోసారి మనమే ఫస్ట్ ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో గురువారం ఆర్టీసీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. డీపీటీవో మాట్లాడుతూ డీఎం స్థాయి అధికారి నిత్యం డిపో రాబడితోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కొత్తగా అన్వేషించాలని ఆదేశించారు. ఆర్టీసీ అంటేనే అందరూ సురక్షిత ప్రయాణంగా భావించారని చెప్పారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రతి వారం డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కండక్టర్లతోనూ సమావేశం నిర్వహించి టికెట్లు కొట్టే సమయంలోను, ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించే సమయంలో గౌరవంగా మాట్లాడాల్సిన బాధ్యతను గుర్తుచేయాలని వెల్లడించారు. ఆర్టీసీ అంటే మన బస్సు, మన సొంతం అనే భావనతో ప్రయాణం చేస్తారని, ఆ నమ్మకాన్ని కాపాడుకోవాల్సి ఉందని సూచించారు. రాబడి వస్తున్న మార్గాల్లో అదనపు సర్వీసులు నడపడంతోపాటు ప్రయాణికులకు అవసరం ఉన్న ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. స్టాపింగ్ ఉంటే ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట, దిగే చోట బస్సును ఆపాలని ఆదేశించారు. అనవసరంగా పదేపదే ప్రయాణికులతో గొడవలు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న ఉద్యోగుల నుంచి డీఎం స్థాయి అధికారి వరకు సమస్యలుంటే తెలియజేస్తే వాటికి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులంతా ఓకే కుటుంబంలా పనిచేయాలని వివరించారు. ప్రతినెలా రాబడిని పెంచే దిశగా డీఎంలు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, 11 డిపోలకు చెందిన మేనేజర్లతోపాటు అసిస్టెంట్ మేనేజర్లు, ముఖ్యమైన అధికారులు హాజరయ్యారు.

చతుర్వేద హవనం.. మరింత విస్తృతం


అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: లోకకల్యాణార్థం టీటీడీ పరిపాలనా భవనంలోని మైదానంలో ఈనెల 29 నుంచి జులై 5వ తేదీ వరకు చేపట్టే శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఈవో ఏవీ.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం కార్యక్రమాన్ని టీటీడీ గతంలో విశాఖపట్నం, కోవూరులో నిర్వహించిందని, ఇప్పుడు మొదటిసారి తిరుపతిలో ఏడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. వేదాలు ఎలా ఉద్భవించాయి, వేదాల విశిష్టత, వేదాలు మానవ జీవన విధానానికి ఏ విధంగా తోడ్పడ్డాయనే అంశాలపై ప్రముఖ పండితులతో ప్రవచనం కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 32 మంది రుత్వికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఉదయం హోమ కార్యక్రమాలు, సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు ఉండాలన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్ర ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, సీఏవో శేషశైలేంద్ర, సీఈ నాగేశ్వరావు, వీజీవో మనోహర్, పీఆర్‌వో డాక్టర్ టీ.రవి, డీపీపీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజగోపాలరావు, డీపీపీ కార్యదర్శి శ్రీనివాసులు, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, ఎస్వీ ఉన్నత వేదాధ్యాయన సంస్థ ప్రత్యేకాధికారి విభీషణశర్మ పాల్గొన్నారు.

చతుర్వేద హవనం కార్యక్రమాలు ఇలా..

ఈనెల 29 నుంచి 5వ తేదీ వరకు జరిగే చతుర్వేద హవనంలో రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చతుర్వేద హవనం, మంత్రాలు పఠిస్తూ హోమం చేపడతారు. 4 నుంచి 6 గంటల వరకు చతుర్వేద మంత్ర పారాయణం, 6 గంటలకు సంగీత, నృత్య కార్యక్రమాల అనంతరం ప్రవచనాలు ఉంటాయి.

క్లుప్తంగా

4 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్


నిందితులతో ఎస్‌ఈబీ సీఐ విజయ్‌కుమార్

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.రాజేంద్ర ఆదేశాల మేరకు గురువారం గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన సూర్య, హేమలతను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.40 వేల విలువ చేసే 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు ఎస్‌ఈబీ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. దీన్ని ఒడిశాలోని గజపతి జిల్లా అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులు కోలార్ ప్రాంతంలో ఇటుక బట్టీ కార్మికులు. ఈ దాడుల్లో గూడూరు ఎస్‌ఈబీ ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, ఎం.కృష్ణ, ప్రసాద్, రవి, రమేష్, బాషా, వెంకటగిరి ఎఈబీ ఎస్‌ఐ గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ మునిశేఖర్, పుట్టయ్య పాల్గొన్నారు.

సురక్షిత సేవ!

- నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం
- క్షేత్ర స్థాయిలో సమస్యలపై ఆరా...
- అర్హతే సంక్షేమానికి ప్రామాణికం
- సమాచారం సేకరించనున్న వలంటీర్లు
- జూలై 1 నుంచి 31 వరకు క్యాంపులు


జగనన్న సురక్షపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు సూచనలు చేస్తున్న దృశ్యం


హాజరైన కలెక్టర్ వెంకటరమణారెడ్డి , జేసీ డీకే బాలాజీ, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హత ఉండే ప్రతి కుటుంబానికీ వంద శాతం అందించాలనే సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారి అర్హతకు తగినట్లుగా అన్ని సంక్షేమ పథకాలపై నిశితంగా పరిశీలించనున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే వారి వివరాలను సేకరించి సచివాలయాలకు సమర్పిస్తారు. తర్వాత జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని 480 గ్రామ సచివాలయాలతోపాటు 211 అర్బన్ సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందులో సచివాలయాలకు చెందిన 11,719 మంది ఉద్యోగులు సేవల్లో భాగస్వాములు కానున్నారు.

రెండు దశల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు ఆయా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారు. వారి సమస్యలపై ఓ జాబితాను తయారు చేస్తారు. అర్హత ఉండి లబ్ధి పొందకుంటే వారి వివరాలను సేకరించి.. ఆ మేరకు సచివాలయంలో వివరాలను అప్పగిస్తారు. రెండో దశలో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ఆ క్యాంపుల్లో సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చు. వలంటీర్లు ఇచ్చిన జాబితా ప్రకారం అర్హత ఉన్న అందరికీ న్యాయం చేసే ప్రక్రియను ప్రారంభిస్తారు.

సర్టిఫికెట్లు.. ఆధార్, మొబైల్ లింక్ ఉచితం

పలువురు తమకు సరైన సమయంలో సర్టిఫికెట్లు అందకపోవడంతో కొన్ని పథకాలను అందుకోలేకపోయామని తెలియజేస్తున్నారు. మరికొందరు ఆధార్ కార్డుకు మొబైల్ లింక్ లేకపోవడంతో పథకాలకు దూరమైనట్లు వలంటీర్ల సర్వేలో తేలింది. దీంతో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమ క్యాంపులు నిర్వహిస్తున్న సందర్భంగా ఉచితంగా అవసరమైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నారు. అంతేకాకుండా ఆధార్ కార్డుకు మొబైల్ లింక్‌ను ఉచితంగా చేయించనున్నారు. దీంతో 90 శాతం సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. మిగిలిన 10 శాతం సమస్యలపై క్యాంపుల్లో చర్చించి న్యాయం చేయనున్నారు.

> **వంద శాతం న్యాయం చేస్తాం**
>
> ప్రభుత్వం అర్హత ఉండే వారికి వందశాతం న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఉద్యోగి ఇందులో భాగస్వాములు కావాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ అర్హత ఉండి పథకం అందకుంటే ఊరుకోం. వారికి సంక్షేమ ఫలాలు అందాల్సిందే.
>
> – కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

వాకాడు(చిట్టమూరు): విద్యుత్ షాక్‌తో ఒకరు మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని కమ్మరిపాళెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన గడ్డం బాబయ్య(58) రైతు కూలీ. తన ఇంట్లో మరమ్మతులు చేస్తున్నాడు. ఇంతలో ఇంటి పెరటి చెట్టుకు తగిలించిన దోటీని తీస్తున్న క్రమంలో ఇంటి పైభాగంలో వెళ్తున్న విద్యుత్ వైర్లకు తగలడంతో బాబయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిట్టమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,440
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,428
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,800
రిటైల్ వెండి గ్రాము	రూ.72.80

జగనన్న చొరవతోనే 'గ్రీన్ ఎనర్జీ'

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గం ఇండస్ట్రియల్ పార్కులో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమను తీసుకొచ్చినట్లు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ స్థాపనకు గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించినట్లు తెలిపారు. దాంతో సీఎంను ఎంపీ గురుమూర్తి కలిసి పుష్పగుచ్ఛంతో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను రూ.610 కోట్ల పెట్టుబడితో స్థాపించి, 1000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. రోజుకు 500 కిలోలీటర్ల బయో ఇథనాల్ తోపాటు ఉప ఉత్పత్తిగా ఏడాదికి 64వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్, 4వేల టన్నుల డ్రైడ్ డిస్టిలరీ గ్రెయిన్స్ తయారీ చేయనున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లోని ఒప్పందాల్లో రూ.1,425 కోట్ల పెట్టుబడులు సాకారం అయ్యాయి. ఈ బయో ఇథనాల్ ప్లాంట్ వల్ల పరిసర ప్రాంతాల్లోని రెండు జిల్లాల రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని ఎంపీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా విరిగిన బియ్యం, రంగు మారిన, పాడైపోయిన బియ్యం నుంచి బయో ఇథనాల్ తయారు చేస్తారు. వరి సాగుచేస్తున్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కజొన్నను వినియోగించుకుని రోజుకు మరో 160 కిలోలీటర్ల డిస్టలరీ తయారీ బై ప్రొడక్ట్‌గా డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్ తయారీ చేస్తారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛంతో అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

నెల్లూరు జిల్లాలోనే రూ. 315 కోట్లతో విశ్వ సముద్ర బయో ఎనర్జీ ప్లాంట్ నెలకొల్పనున్నారు. దీనివల్ల 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టు కూడా మరో 18 నెలల్లో అందుబాటులోకి వస్తుందని ఎంపీ తెలిపారు. రూ.400 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లాలో కాంటినెంటల్ కాఫీ కూడా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారని ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ట్రాక్టర్‌ని ఢీకొన్న కారు

● ఏడుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన ట్రాక్టర్

పాకాల: ట్రాక్టర్‌ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురికి గాయాలైన సంఘటన మండలంలోని నేంద్రగుంట వద్ద చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. పూతలపట్టు–నాడుపేట జాతీయ రహదారి నేంద్రగుంట వద్ద పాకాల నుంచి పెనుమూరుకు ఓ కారు వెళ్తోంది. అదే సమయంలో గాదంకి నుంచి మామిడి కాయల లోడ్డుతో దామలచెరువుకు వెళుతున్న ట్రాక్టర్‌ని కారు ఢీకొనడంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో వస్తున్న కిరణ్(45) పరిస్థితి విషమంగా ఉంది. ట్రాక్టర్ డ్రైవర్ ఈశ్వర్‌బాబు(50)కు బలమైన గాయాలయ్యాయి. ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న ఐదు మందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. సీఐ ఓబులేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీ కొన్న కారు : యువకుడి మృతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): హెరిటేజ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కారు నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమయ్యాడు. పోలీసుల కథనం మేరకు, పనపాకం పంచాయతీ తూర్పుపల్లెకు చెందిన టి.లోకేష్ (35)మస్కట్‌లో ఓ టైల్స్ ఫ్యాక్టరీలో పని చేస్తూ మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం తూర్పుపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై చంద్రగిరికి బయలుదేరాడు. ముంగిలిపట్టు వద్ద హెరిటేజ్ కంపెనీలో హెచ్‌ఆర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆనందనాయుడు కారులో వస్తూ అతివేగంతో లోకేష్ స్కూటర్‌ను ఢీకొట్టాడు. దీంతో లోకేష్ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ హిమబిందు తెలిపారు.

జింకను కాపాడిన షార్ ఉద్యోగులు

సూళ్లూరుపేట: స్థానిక పట్టణంలోని షార్ ఉద్యోగులు నివసించే డీఓఎస్ కాలనీలోకి బుధవారం రాత్రి ఓ జింక తప్పించుకుని వచ్చేయడంతో ఉద్యోగులు కొంతమంది కలిసి దాన్ని సురక్షితంగా కాపాడారు. ఆపై షార్ అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. డీఓఎస్ కాలనీ సెక్రటరీ వేణుగోపాల్ మరికొంతమంది బిత్తరపోయి దూకుతున్న జింకను కాపాడి స్థానిక వన్యప్రాణి సంరక్షణా విభాగం అధికారులకు సమాచారం అందించారు. షార్ డిప్యూటీ డైరెక్టర్ సెంథిల్‌కుమార్ అనుమతితో జింకను షార్ అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.


అటవీప్రాంతంలోకి వెళ్తున్న జింక

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో ఆలయాధికారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా 24న పెద్దశేష వాహనం, 25న హనుమంత వాహనం, 26న గరుడ వాహనంపై స్వామివారు రాత్రి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా తిరుపతికి చెందిన భక్తుడు నరసింహులు స్వామివారికి రూ.18 వేలు విలువగల కురాళాలు, పరదాలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

- పోలీసులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల ఆందోళన
- ఎస్ఐ, రైటర్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ

సైదాపురం : పోలీస్ స్టేషన్‌లో ఉన్న పురుగుల మందు తాగి రెండు రోజుల కిందట ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి బంధువులు ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో సైదాపురం పీఎస్ ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆందోళనకారులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. రాపూరు మండలంలోని అక్కమాంబాపురం గ్రామానికి చెందిన వంగపాటి ఆకాష్‌రాం(22) ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న కేసులో విచారించేందుకు పోలీసులు మంగళవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పురుగుల మందును ఆ యువకుడు తాగాడు. వెంటనే అతన్ని పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కాగా, గతంలో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తాగిన పురుగుల మందును పోలీసులు తీసుకొచ్చి స్టేషన్‌లో ఉంచారు. ఆకాష్‌రాం కూడా ఆ మందు తీసుకుని తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయాడు.


సైదాపురం పీఎస్‌లో విచారణ చేస్తున్న నెల్లూరు ఆర్డీవో

ఎస్ఐ, రైటర్‌ల సస్పెన్షన్

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ పి.నాగబాబును, స్టేషన్ రైటర్ వీరభద్రను సస్పెండ్ చేస్తూ ఎస్సీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్టు డీఎస్పీ కోటారెడ్డి మీడియాతో చెప్పారు. కేసుపై విచారణ కమిటీ వేశామని, దీనిలో నెల్లూరు ఆర్డీవో మలోల, కావలి డీఎస్పీ వెంకటరమణలను ప్రభుత్వం నియమించిందన్నారు. తదుపరి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని ఆర్డీవో మలోల చెప్పారు.

సామాజిక న్యాయం..జగనన్నతోనే సాధ్యం

- పేదరిక నిర్మూలనకు సంస్కరణలు
- ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- గడపగడపకు మహాపాదయాత్రకు విశేష స్పందన

పాకాల: రాష్ట్రంలో సామాజిక న్యాయం సీఎం జగనన్నతోనే సాధ్యమని చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కె.వడ్డేపల్లి గ్రామ పంచాయతీలో 10వ రోజు గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మగారిపల్లి, కంబాలమిట్ట, బీ.ఆర్.పల్లి, తోటి హరిజనవాడ, పోలిరెడ్డిపల్లిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు ఆయన్ను ఆప్యాయంగా పలకరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న శరణార్థులకు మోహిత్‌రెడ్డి ఆర్థిక సాయం చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. చేసిన మేలు మరువం .. సాయం పొందాం.. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కొడుకుగా మీకు ఓటు వేసి రుణం తీర్చుకుంటాం.. అంటూ పల్లె ప్రజలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించారు.

అపూర్వ సాగతం

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు విశేష ఆదరణ లభిస్తోంది. ఆయా గ్రామాల్లో మోహిత్‌రెడ్డికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటా హారతులు పట్టారు. గజమాలలతో సన్మానిస్తూ శాలువలతో సత్కరించారు. పూలపై నడిపించి అభిమానాన్ని చాటుకున్నారు. బాణసంచా పేలుళ్లు, డప్పు మోతలు మార్మోగించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మోహిత్‌రెడ్డి వెంట నడిచారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేసిన లబ్ధిని మోహిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా..? అంటూ ఆరా తీశారు. వారు చెప్పిన వినతులు స్వీకరించి అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చొర తీసుకున్నారు.


మోహిత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పేదరిక నిర్మూలనకు సంస్కరణలు

ప్రభుత్వ పథకాల ద్వారా అట్టడుగు వర్గాల అవసరాలను తీర్చి, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగనన్న పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని మోహిత్‌రెడ్డి గుర్తుచేశారు. అమ్మఒడి, నవరత్నాలు వంటి పథకాల ద్వారా ప్రభుత్వ ఫలాలను అందరికీ అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

పాడి రైతులకు అండగా పశుబీమా

వరదయ్యపాళెం: పశుపోషకులకు వైఎస్సార్ పశు బీమా అండగా నిలుస్తుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం మండల పర్యటనకు వచ్చిన ఆయన సీసీఎల్ కాఫీ పార్కు ఆవరణలో వైఎస్సార్ పశు బీమా పథకం పోస్టర్, వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్న పాడి రైతులకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఒక కుటుంబానికి ఐదు పశువుల వరకు పశు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఉత్పాదక దశలో ఒకసారి ఈనిన 2–10 సంవత్సరాల ఆవులు, 3–12 సంవత్సరాల మేలు జాతి పశువులకు ఒక్కోదానికి రూ.30 వేలు, నాటు పశువుకు రూ.15 వేలు పశు బీమా వర్తిస్తుందన్నారు. 6 నెలలు, ఆపైన వయస్సు గల గొర్రెలు, మేకలకు రూ.6వేలు పశు బీమా వర్తిస్తుందని తెలిపారు. తుపాను, వరదలు, పిడుగుపాటుకు, పాముకాటుకు చనిపోయిన, ప్రమాదం జరిగినా, జబ్బు చేసి చనిపోయినా పశు బీమా పథకం కింద వందశాతం మొత్తం వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పథకానికి సంబంధించి సమస్యల పరిష్కారం కోసం 196 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవి కుమార్, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.